www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 21 జులై 2025 5 పశ్చిమ గోదావరి

పర్యాటకులతో పేరుపాలెం బీచ్‌లో సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం, కెపిపాలెం బీచ్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు, ప్రత్యేక ద్విచక్ర వాహనాలపై బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డున ఇసుకతిన్నెలపై ఆటలాడుకున్నారు. సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేదతీరారు.

బీచ్‌లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

తల్లికి 'వంచన'..!

'తల్లికి వందనం' సొమ్ములందక
కాళ్లరిగేలా తిరుగుతున్న తల్లులు
తొలివిడతలో చూపిన సమస్యలు పరిష్కరించినా ఫలితం శూన్యం
వేలాది కుటుంబాలకు అన్యాయం
ఏలూరు జిల్లాలో 40 వేల మందికి అందని సొమ్ము
పశ్చిమగోదావరి జిల్లాలోనూ వేలాది మందికి నిరాశే
పిజిఆర్‌ఎస్‌కు వచ్చి ఘొల్లుమంటున్న తల్లులు

'ఈ ఫొటోలో ఉన్న ఆమె పేరు సయ్యద్ ఇమామ్‌బీ. ఏలూరులోని వెంకటాపురం. ఈమెకు ఇద్దరు మగ, ముగ్గురు ఆడపిల్లలు. మొత్తం ఐదుగురు సంతానం. ఐదుగురు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారు. వీరికి సొంత ఇల్లు కూడా లేదు. వేరే విద్యుత్ కనెక్షన్లు ఈమె పేరున నమోదైనట్లు చూపి 'తల్లికి వందనం' నిలిపేశారు. దీంతో విద్యుత్ అధికారులు వీరి కుటుంబానికి ఎటువంటి విద్యుత్ కనెక్షన్లూ లేవని ధ్రువీకరణ పత్రం ఇచ్చి ఆన్‌లైన్‌లో తొలగించినా రెండో విడతలోనూ ఆమె పిల్లలకు సొమ్ము పడలేదు. దీంతో ఆమె అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతోంది'.

'ఈమె పచ్చవ లక్ష్మి, భీమడోలు మండలం పూళ్ల గ్రామం, ఇద్దరు ఆడ పిల్లలు. ఇరువురు పూళ్ల హైస్కూల్‌లో ఎనిమిది, ఆరో తరగతులు చదువుతున్నారు. వేరే విద్యుత్ కనెక్షన్ ఈ కుటుంబం పేరున చూపిస్తూ తల్లికి వందనం నిలిపివేశారు. తప్పుగా నమోదైనట్లు విద్యుత్ అధికారులు ధ్రువీకరించినా, సరిచేయించుకున్నా సొమ్ములు పడలేదు. దీంతో ఆ నిరుపేద కుటుంబం బాధ వర్ణనాతీతంగా మారింది'.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న ఇద్దరు తల్లులే కాదు. రెండు జిల్లాల్లో దాదాపు 80 వేల మంది తల్లులను ప్రభుత్వం వంచనకు గురి చేసింది. అర్హతున్నా రకరకాల కారణాలు చూపుతూ తల్లికి వందనం సొమ్ము అందకుండా చేసింది. దీంతో పిల్లల తల్లులంతా అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. విద్యుత్, నాలుగు చక్రాల వాహనం, భూములు ఎక్కువగా ఉన్నట్లు చూపి ఎంతోమందికి 'తల్లికి వందనం' తొలివిడతలో నిలిపివేశారు. గ్రీవెన్స్ ఏర్పాటు చేశామని, సమస్యలు పరిష్కరించుకోవాలని ప్రభుత్వం చెప్పింది. దీంతో తొలివిడత జాబితాలో పేర్కొన్న సమస్యలకు సంబంధిత శాఖల నుంచి పత్రాలు తీసుకుని గ్రామ, వార్డు సచివాలయాల్లో అందించారు. అయినప్పటికీ ఈ నెల పదో తేదీన విడుదల చేసిన రెండో విడత జాబితాలోనూ వారి పేర్లు లేకుండాపోయాయి. ఏలూరు జిల్లాలో మొత్తం 2.40 లక్షల మంది విద్యార్థులను అర్హులుగా గుర్తించగా, ఇంకా 40 వేల మందికి తల్లికి వందనం సొమ్ము జమ కాలేదు. పశ్చిమగోదావరి జిల్లాలో 1.76 లక్షల మంది అర్హులైన విద్యార్థులు ఉన్నప్పటికీ దాదాపు 40 వేల మందికి తల్లికి వందనం అందలేదని తెలుస్తోంది. తల్లికి వందనం నిలుపుదల చేస్తూ ఏ సమస్యనైతే చూపించారో సమస్యను పరిష్కరించినా అర్హత లేనట్లు చూపిస్తున్న పరిస్థితి నెలకొంది. 'తల్లికి వందనం'లో సమస్యలను పరిష్కరించేందుకు సరైన వ్యవస్థ లేకుండాపోయింది. ఫిర్యాదులు వస్తే తీసుకోవడం తప్పితే తమకు ఏమీ తెలియదని అధికారులు చేతులెత్తేస్తున్నారు. దీంతో వేలాది నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందకుండాపోయింది. ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్‌ఎస్‌లోనూ తల్లులు పెద్దఎత్తున వచ్చి తమ సమస్యను అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. 'తల్లికి వందనం'కు సంబంధించిన వివరాలు సైతం అధికారుల వద్ద లేకుండాపోయాయి. దీంతో ఏం జరుగుతుందో ఏఒక్కరికీ అర్థం కాకుండాపోయింది. కనీసం ఉండటానికి ఇళ్లు లేనివారికి కూడా 'తల్లికి వందనం' నిలిపేసిన పరిస్థితి ఉంది. దీనిపై సచివాలయాల్లో ఫిర్యాదులు స్వీకరిస్తున్నా సొమ్ములు వస్తాయో, లేదో తెలియని దుస్థితి నెలకొంది. తల్లికి వందనం సొమ్ము జమైన వారు సైతం ఆ సొమ్ము ఏఖాతాలో పడ్డాయో తెలియని అయోమయం నెలకొంది. సచివాలయాల్లోనూ ఆ వివరాలు చెప్పడం లేదు. ఈ నేపథ్యంలో తల్లికి వందనం సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని తల్లులు కోరుతున్నారు. అందరికీ సొమ్ము అందేవిధంగా చర్యలు తీసుకున్నప్పుడే పేద కుటుంబాలకు న్యాయం జరుగుతుంది.



నినదిస్తున్న సాధన కమిటీ నేతలు, వివిధ సంఘాల నేతలు

అల్లూరి మెమోరియల్ హాలు పునర్నిర్మించాలి

లేనిపక్షంలో ఆగస్టు 15 నుంచి నిరవధిక దీక్షలు
హాలు పునర్నిర్మాణ సాధన కమిటీ నేతలు స్పష్టీకరణ

ప్రజాశక్తి - భీమవరం

అల్లూరి సీతారామ రాజు మెమోరియల్ హాలు పునర్నిర్మాణం చేపట్టకపోతే వచ్చే ఆగస్టు 15వ తేదీ నుంచి నిరవధిక దీక్షలు చేపడతామని హాలు పునర్నిర్మాణ సాధన కమిటీ హెచ్చరించింది. స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఆదివారం అల్లూరి మెమోరియల్ హాలు పునర్నిర్మాణ సాధన కమిటీ సమావేశం చెరుకువాడ రంగసాయి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ పులఖండం కోటేశ్వరరావు, సాధన కమిటీ గౌరవాధ్యక్షులు కనుమూరి సత్యనారాయణరాజు, నాయకులు కంతేటి వెంకట్రాజు మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్ పునర్నిర్మించాలని కోరుతూ పట్టణంలోని ప్రజాప్రతినిధులను అందరినీ కలిశామన్నారు. హాలు నిర్మాణానికి ప్రభుత్వం నుండి పూర్తి సహకారం ఉంటుందని వారంతా హామీ ఇచ్చారని తెలిపారు. సాధన కమిటీ నాయకులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాలు నిర్మాణం చేయకపోతే ఆగస్టు 15 నుంచి నిరవధిక దీక్షలు చేపడతామన్నారు. నాయకులు ఎం.సీతారాంప్రసాద్, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాలు నిర్మించడం వల్ల వేలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ఫీజుతో వివాహ శుభకార్యాలకు ఉపయోగపడుతుందని, ప్రతిఒక్కరి మనస్సులో అల్లూరి పేరు చిరస్థాయిగా ఉంటుందని అన్నారు. వెంటనే సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకుని హాలు నిర్మాణానికి నిధులు కేటాయించి హాలు నిర్మాణం పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బి.రాంబాబు, సత్యనారాయణ, యూత్ హాస్టల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భట్టిప్రోలు శ్రీనివాసు, వి.రాఘవులు, ఎస్‌కె.భాషా, బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, బొక్కా సత్యనారాయణ, ఇంజేటి శ్రీను, జి.రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మండా సూరిబాబు

మహాసభ జయప్రదం చేయాలని ర్యాలీ చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి - కాళ్ల

ఈనెల 23, 24 తేదీల్లో గుంటూరులో జరిగే బిల్డింగ్ వర్కర్స్ 8వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మండా సూరిబాబు కోరారు. కాళ్లలో ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మండా సూరిబాబు మాట్లాడుతూ సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు ఐక్యంగా పోరాడాలని కార్యవర్గం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. ప్రభుత్వాలు తీసుకునే కార్మిక, వ్యతిరేక విధానాలను కార్మికవర్గం తిప్పికొట్టాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. జిల్లా నుంచి పదిమంది ప్రతినిధులు పాల్గొననున్నారని తెలిపారు. ఈ మహాసభ జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నంగేటి కొండ, ప్రధాన కార్యదర్శి మండా సూరిబాబు, ఉపాధ్యక్షులు నూకల సత్యనారాయణ, పలువురు భవననిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

ఘాటెక్కిన పచ్చిమిర్చి ధర

ప్రజాశక్తి - పాలకొల్లు

వర్షాకాలంలో తక్కువ ధర ఉండాల్సిన పచ్చిమిర్చి ధర సెంచరీ దాటింది. ప్రస్తుతం కిలో ధర రూ.80 నుంచి రూ.120 మధ్య ఉంది. ఈ వేసవిలో మిర్చి ధర పెరగకుండా సాధారణంగా ఉంది. ఇప్పుడు తీవ్ర ఎండలకు దిగుబడి తగ్గి ధర పెరిగింది అని వ్యాపారవేత్తలు చెబుతున్నారు. టమోటా ధర కూడా అర్ధ సెంచరీకి పెరిగి నిలకడగా ఉంది. మిగిలిన కాయగూరల ధరలు ఈ వారం పెరిగి స్థిరంగా ఉన్నాయి. టమోటా ధర కిలో రూ.40 నుంచి రూ.60 మధ్య స్థిరంగా ఉంది. వంకాయలు, బీర, బెండ, దొండ, క్యారెట్, బీట్రూట్ ధరలు కిలో రూ.40 నుంచి రూ.60 మధ్య ఉన్నాయి.

అదానీ స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలి

సిపిఎం ఆధ్వర్యాన విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజలకు షాక్ కొట్టే అదానీ స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యాన ఆదివారం మూడో రోజు పట్టణంలోని సవిత్రుపేట, శివాలయం వీధి, శ్రీదేవి పుంత వార్డుల్లో ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అదానీ స్మార్ట్ మీటర్లను బిగిస్తోందని, ఫలితంగా ఛార్జీల మోత మోగనుందని తెలిపారు. రాత్రి 6 గంటల నుండి 10 గంటల వరకూ వినియోగించిన విద్యుత్‌కు అధిక ధర వసూలు చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు జవ్వాది శ్రీను, శిద్ధిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, అన్నం చిన్నారావు, కన్నంరెడ్డి శివాజీ, పక్కుర్తి చిన్న అప్పారావు, నాగిరెడ్డి సాయి, కొమ్మిరెడ్డి ఉదయ్, నాగిరెడ్డి సాయి, వి.అప్పారావు, పతివాడ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంచుతున్న సిపిఎం శ్రేణులు

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించండి

శశి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్

ప్రజాశక్తి - ఉండి

ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని శ్రీశశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ ఖండాపు శ్రీనివాస్ అన్నారు. విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ నల్లా ప్రసాద్ సూచనల మేరకు ఆదివారం ఉండి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో ప్లాస్టిక్ వినియోగం తగ్గించడంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖండాపు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, ప్లాస్టిక్ తిరిగి ఉపయోగించడం వంటి పద్ధతులు పాటించాలని సూచించారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో ప్లాస్టిక్ ముఖ్య భాగం అయిపోయిందని, ఈ ప్లాస్టిక్ వ్యర్థాలు మన శరీరంలో ప్రవేశించి కేన్సర్ భూతాన్ని పెంచుతుందని వివరించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను దూరంగా ఉంచి వీలైనంతవరకు క్లాత్ బ్యాగ్స్, పేపర్ కవర్స్, జ్యూట్ బ్యాగులను విధిగా ఉపయోగించాలని సూచించారు. ధూమపానం, మద్యపానం, నిలువ ఉన్న పచ్చళ్లు, ఫ్రిజ్‌లో ఎక్కువ రోజులు నిలువ ఉంచిన ఆహార పదార్థాలు, బేకరీ ఫుడ్‌లు, ఐస్‌క్రీమ్స్, కూల్‌డ్రింక్స్ తదితర వాటిని విరివిగా వాడటం వల్ల కేన్సర్ వ్యాధికి గురవుతారని తెలిపారు. ఆకుకూరలు, కాయకూరలు, పాలు, పండ్లు ఎక్కువగా తీసుకోవడం ద్వారా కేన్సర్ లాంటి వ్యాధులకు గురికాకుండా చూసుకోవాలని తెలిపారు. అనంతరం మహిళలకు స్టీల్ డబ్బాలు, క్లాత్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మారెళ్ల కామేశ్వరి, దాసరి వరదరాజు, దండు సాయిరామరాజు, సోము లీలా భవాని, వాలంటీర్లు పాల్గొన్నారు.

మహిళలకు స్టీల్ డబ్బాలు అందజేస్తున్న శ్రీనివాస్

ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు
కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె

తాడేపల్లిగూడెం : కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరి విడనాడాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు అన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. లేనియెడల సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాంట్రాక్ట్ కార్మికులుగా ఉన్న వారికి తక్కువ వేతనం ఇస్తున్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగస్తులు అనే పేరుతో సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు జిఒ నెంబర్ 36 ప్రకారం జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచి గ్రాడ్యూటీ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనాల వెంకట్రావు, ధనాల రాజు, తాడికొండ జయరామకృష్ణ, కడమంచిలి ప్రసాద్, సోమరపేట సతీష్, తాడికొండ భాను పాల్గొన్నారు.

దీక్ష శిబిరంలోనున్న కార్మికులు

'పిల్లలకు రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం టౌన్ : చిన్నపిల్లల ఉచిత గుండె మెడికల్ క్యాంప్‌ని వినియోగించుకోవాలని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ఛైర్మన్ బి.బలరాం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. భీమవరం మెంటేవారి తోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి వసుధ ఫౌండేషన్ సహకారంతో చిన్నపిల్లలకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ క్యాంపులో చిన్నపిల్లలను 2డి ఎకో పరీక్షలు చేసి గుండె సమస్యలున్న పిల్లలను గుర్తించి తదుపరి అవసరమగు వైద్యం ఉచితంగా అందిస్తామన్నారు. పిల్లలు బరువు పెరగకపోయినా, ఆకలి లేకపోవడం, గుండె సమస్యలు ఉన్నట్లు అనుమానం కలిగితే ఈ క్యాంపులో చూపించి పరీక్షించుకోవల్సిందిగా కోరారు. ప్రతినెల 4వ మంగళవారం ఈ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

1100 సేవలను వినియోగించుకోండి

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్‌ఎస్ : కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. ప్రజలు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నెంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ సూచించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్‌ఎస్)ను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలోనూ అర్జీల స్వీకరణ ఉంటుందని తెలిపారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను సమీపంలోని డివిజన్, మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాల్లో కూడా సమర్పించుకోవచ్చునన్నారు

ఉలుకూ పలుకూ లేదాయే..!

జిల్లా పరిధిలో ఏదైనా ప్రధాన సమస్య, పెద్ద ఘటన తెరపైకి వస్తే వెంటనే ప్రజాప్రతినిధులతోపాటు జిల్లా ఉన్నతాధికారులు స్పందించడం సర్వసాధారణంగా జరిగేది. అయితే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఇటీవల చోటుచేసుకుంటున్న సంఘటనలపై అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు ఉలుకూపలుకూ లేకుండా ఉండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ఏజెన్సీలో అధికారుల తీరు గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా ఉంటున్న సంగతి అందరికీ తెలిసిందే. దీనిపై ఆయా సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు గిరిజన సంఘాలు, ప్రధానంగా సిపిఎం రంగంలోకి దిగి ఆందోళనలు చేపట్టడం, అధికారులు చర్యలు తీసుకోవడం నిత్యకృత్యం. ఈసారి గిరిజన చట్టాలనే కాదు.. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలోని సచివాలయంలో తహశీల్దార్, సర్వేయర్, విఆర్‌ఒ, విఆర్‌ఎ, మరో ముగ్గురు గిరిజనేతర రైతులతో అత్యంత రహస్యంగా గ్రామసభ నిర్వహణకు పూనుకోవడం అందరినీ విస్తుపోయేలా చేసింది. ఈ విషయం తెలిసిన ఆ గ్రామ గిరిజనులు, సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం నేతలు అక్కడికి చేరుకుని నిలదీయగా గ్రామసభ ఫ్లెక్సీ తొలగించి, సమస్యలు తెలుసుకుందామని చెప్పడంతో విస్తుపోవడం గిరిజనుల వంతైంది. ఎందుకంటే ఆ రోజు పిజిఆర్‌ఎస్‌లో మండల కేంద్రంలో ఉండి వినతులు స్వీకరించాల్సిన తహశీల్దార్ దానికి భిన్నంగా రెడ్డిగణపవరం సచివాలయంలో మకాం వేయడం ఏమిటో, అదీ ఎవరికీ తెలియకుండా ఆ ముగ్గురి గిరిజనేతరుల సమస్యలపైనే ఎందుకంత ఆసక్తో తహశీల్దారనే చెప్పాలి. బుట్టాయగూడెం ఎస్ఐ అక్కడికి చేరుకుని తహశీల్దార్‌ను అక్కడి నుంచి తీసుకెళ్లారు. ఇంతవరకూ బాగానే ఉంది. ఈ విషయం వివిధ మాధ్యమాల ద్వారా బాహ్య ప్రపంచానికి తెలిసింది. అయితే దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు ఆర్‌డిఒ, జెసి, కలెక్టర్‌గాని, గిరిజన ఎంఎల్‌ఎగాని ఎవరూ కనీసం స్పందించకపోవడం చర్చనీయాంశమైంది. అంటే



ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల అండతోనే తహశీల్దార్ గిరిజన చట్టాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఇక ఏజెన్సీలోనే ప్రేమజంట వ్యవహారంలో యువకుని తండ్రిని బుట్టాయగూడెం పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చి చితకబాదారు. కేన్సర్ పేషెంట్ అనే కనికరమూ లేకుండా థర్డ్ డిగ్రీ ప్రయోగించడంతో సదరు వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురై బుట్టాయగూడెం ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. దీనిపై ఆదివాసీ గిరిజన సంఘాలు ఆందోళన సైతం నిర్వహించి, కారకుడైన ఎస్ఐను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశాయి. కనీసం దీనిపైనా సంబంధిత డివిజన్, జిల్లాస్థాయి అధికారులెవ్వరూ స్పందించకపోవడం గమనార్హం. ఏజెన్సీలో గిరిజనులపై అధికార యంత్రాంగం దమనకాండ సాగిస్తున్నా జిల్లా అధికారులకు పట్టదా, ఉద్దేశపూర్వకంగానే పట్టించుకోవడం లేదా అనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇక భీమడోలు మండలం పొలసానిపల్లిలోని గురుకులంలో పాఠశాల ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటి వరకూ తెరుచుకోకపోవడం గమనార్హం. కళాశాల తరగతులు ప్రారంభమైనా విద్యార్థిని మృతితో విద్యార్థులంతా ఇళ్లకు వెళ్లిపోయారని అక్కడి అధికారులు చెబుతున్నారు. ఇటీవల ఉంగుటూరు నియోజకవర్గంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ సైతం అసలు అక్కడ పరిస్థితులేమిటీ అనే దానిపై అక్కడ పర్యటించి సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు చుట్టుపక్కల కృష్ణా డెల్టా పరిధిలోని పొలాలకు సాగు నీరందక వరి నారుమళ్లు, నాట్లు ఎండుతుండటంతో రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. ఇదే పరిస్థితి పశ్చిమగోదావరి జిల్లాలో సాక్షాత్తూ రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి సొంత నియోజకవర్గంలోని యలమంచిలి, పోడూరు, పక్కనే ఉన్న ఆచంట, నరసాపురం మండలాల్లో సాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. జిల్లాలో ముందుకొస్తున్న ప్రధాన సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులే స్పందించకపోతే ప్రజలు తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో పాలకులే చెప్పాలి. ప్రజాప్రతినిధులు సైతం తూతూమంత్రపు ప్రకటనలు ఇవ్వడం మినహా స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం రెండు జిల్లాల్లోని ప్రజలు సమస్యలు పరిష్కారం కాక తీవ్ర నిరాశ, నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రధాన సమస్యలపై ఉలుకూ, పలుకూ లేకుండా పట్టనట్లు వ్యవహరించకుండా, సమస్యలపై కచ్చితంగా స్పందిస్తేనే అధికార యంత్రాంగంపై ప్రజలకు నమ్మకం నిలిచే అవకాశం ఉంటుంది.

- విఎస్‌ఎస్‌వి.ప్రసాద్

యథేచ్ఛగా పంట కాలువలోకి ఆక్వా వ్యర్థాలు

ఎంఎల్‌ఎ ఆదేశాలు బేఖాతరు..

ప్రజాశక్తి - ఉండి

నియోజకవర్గంలోని ప్రజలకు స్వచ్ఛమైన జలాలను ఇవ్వాలనే స్థానిక ఎంఎల్‌ఎ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు ఆశయాన్ని ఆక్వారైతులు నీరుగారుస్తున్నారు. నిబంధనలకనుగుణంగా క్షేత్రస్థాయిలో ఆక్వా చెరువులు ఉన్నాయో లేవో చూడాల్సిన అధికారులు కేవలం నోటీసులతోనే సరిపెట్టడంతో ఆక్వా రైతులు నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థ జలాలను పంట కాలువల్లోకి విడుదల చేస్తున్నారు. మండల వ్యాప్తంగా పెద్ద మొత్తంలో ఆక్వా సాగు జరుగుతుంది. సిరులు పండే వ్యవసాయ భూములను ఆక్వా చెరువులుగా మార్చేసి చేపలు, రొయ్యలు సాగు చేస్తున్నారు. విదేశీ మారకద్రవ్యం వస్తుందనే సాకుతో కొంతమంది స్వార్థపరుల కోసం అమాయక ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన అధికారులు ప్రేక్షక పాత్రను వహిస్తున్నారు. కాలుష్య నివారణ అధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదు. ఫలితంగా మురుగు డ్రెయినేజీలలో పారాల్సిన వ్యర్థపునీరు పంట కాలువల్లో ప్రవహిస్తుంది. ఆక్వా వ్యర్థాలు సైతం మూటలకొద్దీ పంట కాలువల ద్వారానే ప్రవహిస్తున్నాయి. చాలా గ్రామాలలో మంచినీటి చెరువులు అడుగంటడంతో ఇప్పుడు పంట కాలువలకు చెందిన నీటిని అన్ని గ్రామాలలోనూ రక్షిత మంచినీటి పథకాల చెరువులకు నింపుతున్నారు. ఈ నీటిని తాగిన ప్రజలు అనేక రకాలుగా అనారోగ్యాలకు గురవుతున్నారు. ఇటీవల కాలంగా ఉండి నియోజకవర్గంలో కేన్సర్, డయాలసిస్ వంటి దీర్ఘకాలిక రోగుల సంఖ్య పెరగడంతో డయాలసిస్ సెంటర్‌ను సైతం రఘురామకృష్ణరాజు ప్రారంభించిన విషయం తెలిసిందే. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లలోనూ, ఆర్‌ఎంపి డాక్టర్ల వద్ద రోగులు బారులు తీరుతున్నారు. ఆక్వా వ్యర్థాలు పంటకాలువల్లో ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అలాగే మురుగునీటి సౌకర్యంలేని చెరువులను ధ్వంసం చేస్తానని ఎంఎల్‌ఎ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు ఇచ్చిన ఆదేశాలను నెరవేర్చి ప్రజారోగ్యం కాపాడాలని ప్రజలు మొరపెట్టుకుంటున్నారు.

మహదేవపట్నంలో పంట కాలువలోకి ఆక్వా జలాలు విడుదల చేస్తున్న రైతులు

రంగరాజుకు ప్రత్యేక బహుమతి

ప్రజాశక్తి - ఉండి

విశాఖ సాహిత్య మాసపత్రిక 16వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన జాతీయ స్థాయి శ్రీమదిమపూడి రామకృష్ణయ్య స్మారక కార్టూన్ పోటీల్లో మండలంలోని చెరుకువాడకు చెందిన డాక్టర్ గాదిరాజు రంగరాజు ప్రత్యేక బహుమతి పొందినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరులో బహుమతిని రాష్ట్ర శాసనమండలి మాజీ ఉప సభాపతి, అవనిగడ్డ ఎంఎల్ఎ మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా తీసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోసూరు రత్నం, ఈతకోట సుబ్బారావు, అమరావతి కృష్ణారెడ్డి, అప్పడా వైస్ ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి, పిఆర్.శివకుమార్, పలువురు కార్టూనిస్టులు పాల్గొన్నారు.

పరికరాల అందజేత శిబిరం వాయిదా

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని అర్హులైన బహుళ అవసరాలు కలిగి ఉన్న వికలాంగులకు, వృద్ధులకు ఉచితంగా పరికరాలు అందించేందుకు ఈనెల 21 సోమవారం జరగాల్సిన క్యాంపు అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని ఎంపిడిఒ ఎంఎస్.ప్రభాకర రావు ఆదివారం ఇక్కడ తెలిపారు. నియోజకవర్గంలోని పెనుమంట్ర, పెనుగొండ, ఆచంట మండలాల పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లోని అర్హుల కోసం పెనుగొండ పంచాయతీ ప్రాంగణంలో ఈ క్యాంపు జరుపుతున్నట్లు ముందు ప్రకటించినప్పటికీ ఆయన పేర్కొన్నారు. జిల్లా అధికారుల ఆదేశం మేరకు ఈ క్యాంపు జరిగే తేదీ త్వరలో వెల్లడిస్తామని ఆయన అన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కులమతాలకు అతీతంగా కమిటీ సభ్యులు జాతర కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పెంటపాడు గ్రామంలోని పెంట్యమ్మ అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా చీర, సారె సమర్పించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామదేవత పెంట్యమ్మ ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలతో పాటుగా రాష్ట్ర ప్రజలందరిపై మెండుగా ఉండాలని ఆయన కోరారు. ప్రతి నెల నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి, భవన నిర్మాణ కార్మికుల ఛైర్మన్ వలవల బాబ్జి, బిజెపి కన్వీనర్ ఈతకోట తాతాజీ, తోట రాజా, పాలూరి వెంకటేశ్వరరావు, జనసేన పెంటపాడు మండల అధ్యక్షులు పుల్ల బాబి, పైబోయిన వెంకట్రామయ్య, అడబాల మురళి పాల్గొన్నారు.

మావుళ్లమ్మ జాతర ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం 39వ వార్డులో శ్రీమావుళ్లమ్మ, కనకదుర్గ అమ్మవార్ల 45వ జాతర మహోత్సవాన్ని ఆదివారం రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) ప్రారంభించారు. ఆషాఢ మాసంలో వాడవాడలా భక్తులు శ్రీమావుళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను నిర్వహించడం ఎంతో శుభ పరిణామమని అన్నారు. 45 ఏళ్లుగా సాంప్రదాయంగా అమ్మవారి జాతర వేడుకలను నిర్వహించడం అభినందనీయమని ఎంఎల్ఎ అంజిబాబు అన్నారు. కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మిథున్ రెడ్డి అక్రమ అరెస్ట్ దారుణం : వైసిపి

ప్రజాశక్తి - ఆచంట

రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమని వైసిపి సీనియర్ నేతలు సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు ఆరోపించారు. ఆదివారం ఆచంటలో వారు విలేకరులతో మాట్లాడారు. మిథున్ రెడ్డి అక్రమ అరెస్టును ఖండిస్తూ ఆచంటలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైసిపి శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఇరువురు మాట్లాడుతూ రాజకీయ ప్రతీకారంతో మిథున్ రెడ్డిని కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసిందని తెలిపారు. మద్యం అక్రమ కేసులో ఎలాంటి ఆధారాలు లేకపోయినా మిథున్ రెడ్డి అరెస్ట్ చేయాలనుకునే చంద్రబాబు కక్ష పూరిత పాలనకు నిదర్శనమన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో టిడిపిపై ప్రజలలో తిరుగుబాటు మొదలైందని, ప్రజల దృష్టి మళ్లించడానికి ఇటువంటి అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సర్పంచుల అక్యూపెక్ట్ చంటి, జక్కంశెట్టి శ్రీరామ్, రాష్ట్ర యూత్ జాయింట్ సెక్రెటరీ కొప్పార్తి దేవా పాతూరి రెడ్డి పాల్గొన్నారు.

ఆచంట : లిక్కర్ స్కాం పేరుతో చంద్రబాబు ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని వైసిపి నాయకుడు వైట్ల కిషోర్ కుమార్ అన్నారు. ఆదివారం ఆచంట విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేసి, అసత్య ఆరోపణలతో వైసిపి నిర్బంధానికి ప్రభుత్వం కక్షసాధింపుతో అక్రమ అరెస్టులు కొనసాగిస్తున్నారు. దీనికి పరాకాష్ఠగా ఎంపి మిథున్ రెడ్డి అరెస్ట్ తీవ్రస్థాయిలో ఖండిస్తున్నారు. ప్రజాస్వామ్యానికి విఘాతంగా పరిణమించిన ఇటువంటి చర్యలను ప్రజాస్వామ్య వాదులు ప్రతిఘటించి తీవ్రంగా ఖండించాలన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సీతారామాపురం సౌత్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం సీతారామాపురం గ్రామంలోని రెండు మోటార్ సైకిల్స్ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో మండలంలోని రుస్తుంబాద యద్ద పల్లెవారి తోట గ్రామానికి చెందిన పరసా సాయి చందు(26) మృతి చెందాడు. ఆనంద్, పి.రాజులకు గాయాలు కావడంతో వైద్యం నిమిత్తం అంబులెన్సులో నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చనిపోయిన సాయి చందు కుటుంబ సభ్యులను బొమ్మిడి నాయకర్, డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

పనిచేయని ఫ్రీజర్ ఎందుకు : ఎంఎల్ఎ

మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

నరసాపురం ఏరియా ఆసుపత్రిలో ప్రభుత్వ సర్వార ఉన్న ఫ్రీజర్ మరమ్మతులకు గురైంది. స్వచ్ఛంద సంస్థలు అందజేసిన రెండు ఫ్రీజర్లు వినియోగంలో ఉన్నాయి.

శనివారం సాయంత్రం సీతారామాపురంలో జరిగిన రహదారి ప్రమాదంలో మృతిచెందిన పొన్నమండ చంద్రావతి మృతదేహాన్ని ఒక ఫ్రీజర్‌లో భద్రపరిచారు. సరిపడ్డాక ఆదివారం చోటుచేసుకున్న విద్యుదాఘాతంతో మృతిచెందిన చత్తీస్ ఘడ్ రాష్ట్రానికి చెందిన యువకుడి మృతదేహాన్ని భద్రపరిచారు. ఆదివారం సాయంత్రం సీతారామాపురంలో జరిగిన రహదారి ప్రమాదంలో మృతిచెందిన సాయిచంద్ మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచేందుకు ఫ్రీజర్ కోసం కుటుంబ సభ్యులు వేచి ఉన్నారు. దీంతో ఆ మృతదేహాన్ని ఆసుపత్రిలో ఉన్న శవాగారంలో కాంక్రీట్ దిమ్మెపైనే వదిలారు. పోస్టుమార్టం మరుసటిరోజుకు చేయనుండడంతో ఆ మృతదేహం కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. కొన్ని నెలలుగా ఈ ఫ్రీజర్ పనిచేయడంలేదని సిబ్బంది తెలుపుతున్నారు. అయితే ఫ్రీజర్ అద్దెకు తీసుకుని బాధిత కుటుంబ సభ్యులు భద్రపరుచుకుంటున్నారు. అదే సమయంలో ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ నాయకర్ అక్కడకు వచ్చారు. ఆయనకు స్థానికులు విషయం తెలియజేయడంతో సిబ్బందిని పనిచేయని ఫ్రీజర్ ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గాయాలపాలైన మహిళ మృతి

మొగల్తూరు : రహదారి ప్రమాదంలో మహిళ మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసినామని ఎస్ఐ జి.వాసు తెలిపారు. సంఘటనకు సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం కృష్ణాజిల్లా కృత్తివెన్ను గ్రామానికి చెందిన పొన్నమండ శ్రీనివాస్ ఈనెల 19న ద్విచక్ర వాహనంపై తన తల్లి చంద్రావతి(65)ని తీసుకొని అంబేద్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది దేవాలయానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళుతుండగా మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధి సీతారామపురంలో మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. దీంతో చంద్రావతి రహదారిపై పడిపోవడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. ఆమె చికిత్స నిమిత్తం అత్యవసర వాహనంలో నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీనిపై చంద్రావతి కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కోడి పందెం స్థావరంపై దాడి

10 మంది అరెస్ట్

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని అర్తమూరు గ్రామంలోని కోడి పందెం స్థావరంపై పోలీసులు ఆదివారం దాడిచేసి 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,100 నగదు, రెండు కోళ్లు, కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉండి పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రయివేట్ హాస్టళ్లుగా మారిన భవనాలు..

అనుమతులు గృహ నిర్మాణాలకే..
కమర్షియల్ పంథాలో అద్దెలు..
గ్రామ పంచాయతీ ఆదాయానికి భారీ గండి..

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మండలంలోని కొవ్వాడ అన్నవరం గ్రామం పచ్చదనానికి, ప్రశాంతతకు నిలయం. ఈ గ్రామంలో అన్ని తరగతులతో పాటు పేరు మోసిన భూస్వాములు ఉంటారు. ఇక్కడే దేశవ్యాప్త గుర్తింపు పొందిన కళాశాల ఉండడంతో పట్టణానికి దీటుగా గ్రామాభివృద్ధి చెందుతుంది. అయితే గత కొంతకాలంగా ఈ గ్రామంలో ఉన్న కొన్ని భవనాలు ప్రయివేట్ హాస్టల్స్‌గా మారాయి. అనుమతులు నివాసగృహాల వరకు మాత్రమే ఉండగా యజమానులు మాత్రం ఆ భవనాలను విద్యార్థుల హాస్టల్స్‌గా మార్చి కమర్షియల్ పంథాలో అద్దెలకిచ్చారు. ఒక్కొక్క భవనానికి యజమానులు నెలవారి లక్షల రూపాయలను అద్దెల రూపంలో తీసుకుంటున్నారు. కాని గ్రామపంచాయతీ మాత్రం భారీగా ఆదాయాన్ని కోల్పోయింది. గ్రామంలో ఏర్పాటైన ప్రయివేట్ హాస్టల్లో యజమాన్యాలు తమ వ్యాపారం కోసం అడ్డగోలు అనుమతులను పొంది హాస్టల్స్ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇటీవల జరిగిన ఒక వివాదం వల్ల గ్రామం ప్రశాంతత కోల్పోయింది.

ఈ గ్రామంలో పేరొందిన కళాశాల ఉండడంతో సుదూర ప్రాంతం నుంచి విద్య కోసం వచ్చే విద్యార్థుల కోసం వసతి గృహాలు పెద్ద ఎత్తున వెలిశాయి. అయితే ఈ హాస్టల్స్ యాజమాన్యాలు అనుమతులు ఇళ్ల నిర్మాణాలకి తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా పెద్దపెద్ద భవనాలు నిర్మించి వాటిని అధిక మొత్తంలో హాస్టల్స్‌కు అద్దెకిస్తున్నారు. దీంతో ప్రయివేట్ హాస్టల్స్ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా జరుగుతుంది. ఈ హాస్టల్స్ కారణంగా గ్రామానికి ఆదాయం లేకపోగా గ్రామానికి చెడ్డ పేరు వచ్చే విధంగా ఈ ప్రాంతంలో ఉన్న

కొవ్వాడ అన్నవరంలో ఉన్న ప్రయివేట్ హాస్టల్

కొన్ని హాస్టల్స్‌కు సంబంధించిన విద్యార్థులు ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు కూడా పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే ఈ హాస్టల్స్ వల్ల గ్రామంలోని ఆ ప్రాంతంలో అదే కాలువ గట్టు వెంబడి రాత్రి పగలు అనే తేడా లేకుండా విద్యార్థులు పలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. కొంతమంది యజమానులు గృహనిర్మాణపు అనుమతులు తీసుకొని అపార్ట్మెంట్‌లు నిర్మించి వ్యాపార కేంద్రాలుగా భవనాలను మార్చినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకుంటారో లేదో వేచి చూడాలి.

తన, పర భేదం లేకుండా సేవ చేస్తాను

పిఎసిఎస్ ఛైర్మన్ భైరిశెట్టి దుర్గారావు

ప్రజాశక్తి - పెనుమంట్ర

తనకు ఇచ్చిన పదవి ద్వారా సొసైటీ అభివృద్ధికి తన, పర భేదం లేకుండా సేవ చేస్తానని మాముడూరు పిఎసిఎస్ ఛైర్మన్ భైరిశెట్టి దుర్గారావు అన్నారు. తనకు తొలిసారిగా నామినేటెడ్ పదవి ఇచ్చిన మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తమ త్రి సభ్యులతో సొసైటీలో వ్యవసాయ రంగం అభివృద్ధికి కృషిచేస్తామని అన్నారు.

ఆలమూరు సొసైటీని అభివృద్ధి చేస్తా

పిఎసిఎస్ నూతన ఛైర్మన్ కోయ నాగపోతురాజు

ప్రజాశక్తి - పెనుమంట్ర

గతంలో పంచాయతీ సర్పంచి, ఎంపిటిసిగా చేసిన అనుభవంతో ఆలమూరు సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆలమూరు పిఎసిఎస్ నూతన ఛైర్మన్ కోయ నాగపోతురాజు అన్నారు. తొలిసారిగా నామినేటెడ్ పదవి ఇచ్చిన మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తమ హయాంలో సొసైటీ ప్రగతికి కృషి చేస్తామని అన్నారు.

ఎంఎల్ఎను కలిసిన సోమేశ్వర స్వామి దేవస్థాన ఛైర్మన్ బంగార్రాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పంచారామ క్షేత్రమైన భీమవరం శ్రీసోమేశ్వర జనార్ధన స్వామి దేవస్థానం అభివృద్ధికి నూతనంగా ఏర్పాటు అవుతున్న పాలకవర్గ సభ్యులు కృషి చేయాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సోమేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్‌గా చింతలపాటి బంగార్రాజు నియమితులైన సందర్భంగా ఆయన ఎంఎల్ఎ అంజిబాబును కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేస్తూ ఆలయాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఛైర్మన్ చింతలపాటి బంగార్రాజు మాట్లాడుతూ ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి ఆలయాభివద్ధికి కృషి చేస్తామని అన్నారు. అనంతరం బంగార్రాజును అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో శివరావుపేట వాస్తవ్యులు, కూటమి నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య సేవలు

ప్రజాశక్తి - తణుకు

వృద్ధుడికి వైద్యం చేస్తున్న వైద్యులు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించు ఇంటింటికీ వైద్యం కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నేత్ర వైద్యులు డా.హుస్సేన్ అహ్మద్, ఆర్థోపెటిక్ డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య తణుకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ఎనిమిది మంది వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందజేశారు. సభ్యులు అతికాల ప్రసాదరావు ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షులు అల్లూరి కరుణాకరచౌదరి, కోశాధికారి అర్జి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి సీనియర్ నేత రాంబాబు పుట్టినరోజు

మొగల్తూరు : టిడిపి సీనియర్ నాయకులు పాల రాంబాబు పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షులు, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులో నాగరాజు కాంప్లెక్స్‌లో రాంబాబు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేకును రాంబాబు కోసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో టిడిపి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

సొసైటీల అభివృద్ధికి కృషిచేయాలి

ఎంఎల్ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - గణపవరం


ఎంఎల్ఎ ధర్మరాజును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

నూతన సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు సొసైటీ అభివృద్ధికి కృషిచేయాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆదివారం మండలంలో కొత్తగా నియమించబడిన సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులకు జరిగిన అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ అధ్యక్షులు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. సొసైటీ ద్వారా రైతులకు వచ్చే సంక్షేమ, సబ్సిడీ పథకాలు రైతులకు అందించాలని చెప్పారు. అనంతరం ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు సొసైటీలకు కూటమి ప్రభుత్వం చేయూతనిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు సభ్యులకు అభినందనలు తెలిపారు. కూటమి నాయకులు, సొసైటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎస్ఐ పర్రు సొసైటీ ఛైర్మన్‌గా నడింపల్లి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - పెనుమంట్ర


ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

ఎస్ఐ పర్రు సొసైటీ ప్రగతికి నిరంతరం కృషిచేస్తామని ఛైర్మన్ నడింపల్లి సత్యనారాయణ రాజు అన్నారు. ఆదివారం ఉదయం సొసైటీ ప్రాంగణంలో జరిగిన ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆయన, సొసైటీ సభ్యులు వెలగల ప్రభాకర రెడ్డి, వనం వెంకట శ్రీనివాస్ ప్రమాణం చేశారు. తన పూర్వ అనుభవంతో రైతులకు సేవలు అందిస్తానని ఛైర్మన్ నడింపల్లి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పితాని తనయుడు పితాని వెంకట్, టిడిపి మండల అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి, దేశం క్లస్టర్ కన్వీనర్ చింతపల్లి రామకృష్ణ, స్థానిక రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి సొసైటీలు పనిచేయాలి

విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్


మాట్లాడుతున్న ఎంఎల్ఎ బొలిశెట్టి

తాడేపల్లిగూడెం : కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునే విధంగా సహకార సంఘాలు పనిచేయాలని, తద్వారా రాష్ట్రాభివృద్ధి చెందుతుందని రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పెంటపాడు మండలంలోని కోరుమిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్మన్ వల్లూరి సాయి రమేష్, సభ్యులు జాస్తి సుబ్బారావు, కొండ్రెడ్డి బుల్లి రాజుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమంకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టే విధంగా సొసైటీలు పనిచేయాలని కోరారు. గత సంవత్సరం కూటమి పాలనలో జిల్లా జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా 7 లక్షల 50 వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయించడం జరిగిందని, ఆరు లక్షల టన్నులకు జిల్లాలో ధాన్యం కోరగా మరో లక్ష టన్నులకు గాను పౌరసరఫరాల మంత్రి విన్నపం మేరకు పూర్తిస్థాయిలో కొనుగోలు జరిగిందని ఆయన అన్నారు. రైతు పండించిన ప్రతి గింజకు న్యాయం జరిగిందని, రైతు సంక్షేమంకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. దొంగల ముఠా నాయకుడు గజదొంగ అవుతాడని ఘాటుగా జగన్‌పై విమర్శించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి, ఎపిసిఒబి ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, భవన, ఇతర కార్మికుల సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ వలవల మల్లిఖార్జున రావు, మాజీ ఎంఎల్ఎ ముళ్లపూడి వెంకట కృష్ణారావు, టైలర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ ఆకాశపు స్వామి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పాతూరి రాంప్రసాద్ చౌదరి, జనసేన పెంటపాడు మండల అధ్యక్షులు పుల్ల బాబి, తాడేపల్లిగూడెం రైస్ మిల్లర్స్ అధ్యక్షులు ఎం.వెంకన్న బాబు, కోరుమిల్లి గ్రామ సొసైటీ మాజీ అధ్యక్షులు, జనసేన, కూటమి నాయకులు పాల్గొన్నారు.

దూర విద్యకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - మొగల్తూరు

రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం(దూర విద్యా విధానం) ద్వారా 10వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రయివేటుగా చదివేందుకు ఆసక్తి ఉన్న వారు మొగల్తూరులోని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో సంప్రదించాలని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ వర్ధమాన రవిశంకర్ సర్కార్ ఆదివారం తెలిపారు. 10వ తరగతి ప్రవేశానికి వచ్చేనెల 31 నాటికి 14 సంవత్సరాలు నిండి ఉండాలని, ఇంటర్మీడియట్ ప్రవేశానికి 15 సంవత్సరాలు నిండి ఉండాలని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 31 వరకు గడువు ఉందన్నారు.

వరిలో ఎరువుల వాడకం తగ్గించాలి

ఫారం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్

పెనుమంట్ర : వరిలో ఎరువుల మోతాదు తగ్గించడానికి రైతులు సిద్ధపడాలని అప్పుడే భూ సారం ఎక్కువ కాలం నిలిచి ఉంటుందని మార్టేరులోని ఆచార్య ఎన్‌జి రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన చేశారు. రసాయనిక ఎరువులను దేశంలో సగటున ఎకరాకు 56 కిలోలు వాడుతుండగా, ఆంధ్రప్రదేశ్‌లో సరాసరి 102 కిలోలు(82 శాతం అధికం) వినియోగిస్తూ దేశంలో 8వ స్థానంలో ఉందని అన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో సగటున ఎకరాకు 164 కిలోలు(193 శాతం అధికం), పశ్చిమ గోదావరి జిల్లాలో 170 కిలోలు(203 శాతం అధికం) వినియోగిస్తున్నారన్నారు. వ్యవసాయ రంగంలో వివిధ అధ్యయనాల ప్రకారం పశ్చిమ గోదావరి జిల్లాలోని పెనుమంట్ర, పెనుగొండ, అత్తిలి మండలాల్లో ఎరువుల వినియోగం అత్యధికంగా ఉందని పేర్కొన్నారు. రైతులు సాగు వ్యయంలో దాదాపు 25 శాతం రసాయన ఎరువుల కోసమే వెచ్చిస్తున్నారని, నాట్లు వేసిన 25 రోజుల తర్వాత రైతులు సిఫారసు చేసిన మోతాదు కన్నా అధికంగా భాస్వరం ఉన్న కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా వేసినచో పంటకు ఉపయోగపడటమే కాక పెట్టుబడి ఎక్కువ అవుతుందన్నారు.

వరిలో సమగ్ర ఎరువుల/పోషకాల యాజమాన్యం : భూసార పరిరక్షణకు, ఉత్పత్తికు రసాయనిక ఎరువులతో పాటు సేంద్రియ లేదా జీవన ఎరువులను వాడి, పైరుకు సమతుల్యంగా పోషక పదార్థాలను అందజేయాలి. సేంద్రియ, రసాయనిక ఎరువులను కలిపి వినియోగించడం వల్ల భూసారం పెరగడమే కాకుండా పోషకాల లభ్యత కూడా పెరుగుతుందన్నారు. వరి మాగాణుల్లో అపరాలు, జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట పైర్లను పెంచి పూతదశకు ముందు కలియదున్నడం ద్వారా భూసారం పెరగడమే కాకుండా సుమారు 20-25 శాతం వరకు నత్రజని, భాస్వరం, పొటాషియం ఎరువులను ఆదా చేయవచ్చని పేర్కొన్నారు. ద్రవ జీవన ఎరువులైన అజోస్పిరిల్లుం 500 మీ.లీ, ఫాస్ఫో బాక్టీరియా 500 మీ.లీ, పొటాషియం సాల్యుబులైజింగ్ బాక్టీరియా 500 మీ.లీ, సూడోమోనాస్ 500 మీ.లీలను ఎకరానికి 20 కిలోల ఇసుక లేదా 100 కిలోల పశువుల ఎరువు లేదా 20 కిలోల వానపాముల ఎరువుతో దమ్ము చేసిన పొలంలో నాటిన 7-10 రోజులకు, 30 రోజులకు వేసుకోవచ్చని సూచించారు. భూసార పరీక్షా ఫలితాల ప్రకారం నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను వేసుకోవాలని, సార్వాలో ఎకరాకు సిఫారసు చేసిన 36:24:24 కిలోల నత్రజని, భాస్వరం, పొటాష్‌లను స్వర్ణ, ఎంటియు-1318 రకాలకు తప్ప మిగిలిన అన్ని రకాలకు వేసుకోవచ్చు అన్నారు. స్వర్ణ, ఎంటియు-1318 రకాలకు 24:24:24 కిలోల నత్రజని, భాస్వరం, పొటాష్‌లను మాత్రమే వేయాలన్నారు. నత్రజని వినియోగ సామర్థ్యం పెంచడానికి 50 కిలోల యూరియాకి 10 కిలోల వేపపిండి లేదా 250 కిలోల తేమ కలిగిన బంక మట్టిని కలిపి రెండు రోజులు నిల్వ ఉంచి పొలంలో వెదజల్లితే నత్రజని వినియోగం పెరుగుతుందన్నారు. భాస్వరాన్ని దమ్ములోనే ఊడ్పునకు ముందుగా వేసుకోవాలని, ఏకారణం చేతనైనా దమ్ములో వేయలేకపోతే నాట్లు వేసిన 10 రోజుల లోపులోనే వేసుకోవాలన్నారు. వరిలో నత్రజనిని ఎక్కువగా వాడి భాస్వరం, పొటాషియం ఎరువులను సరైన మోతాదులో వేయకపోతే చీడపీడల ఉధృతి పెరిగి వరి పైరులో తాలు కంకులు ఎక్కువగా ఏర్పడి, దిగుబడి తగ్గి పంట నాణ్యత లోపిస్తుందన్నారు. రైతులు రెండేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించుకోవాలని అన్నారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి వారు, సీనియర్ డివిజన్, తాడేపల్లిగూడెం

HMOP.No.50/2025

మధ్య
సబ్బారపు అనే చిటికిన రాజ్యలక్ష్మి ...పిటీషనరు
మరియు
సబ్బారపు లక్ష్మణరావు అనే నాని ...రెస్పాండెంటు

పబ్లిక్ నోటీసు

ఇందుమూలముగా ఇందు రెస్పాండెంటుకు తెలియచేయునది ఏమనగా మీపై పై పిటీషనరు దాఖలు చేసిన పిటిషను మీ పై నోటీసు పంపినను మీరు కావలెనని సదరు నోటీసు తీసుకొనక కాలహరణం కావించుచున్నందున సదరు పైకోర్టు వారు మీకు పేపరు పబ్లికేషను ద్వారా యివ్వగలందులకు ఆర్డరు పాసుకావించి సదరు వాయిదాను 23.7.2025 నకు మీ రాక కోసము వేసివున్నారు. కావున సదరు పై వాయిదాకు మీరు ఖూద్దున గాని లేక విషయ పరిజ్ఞానం గల ప్లీడరు గారి ద్వారా వచ్చి సదరు మీ వాదనను వేయగలరు. అటుల కాని పక్షాన మీ ప్రజన్సు లేకనే తీర్పు చెప్పబడునని యిందుమూలముగా తెలియచేయుచున్నాము.

పంపవలసిన అడ్రసు :
Sri Subbarapu Lakshmanarao, Son of Tatababu 28 Yrs, Hindu, Private Employment, Working at Sai Vilas Hotel, Jublee road, Tadepalligudem, Presently Residing at Chitikena Raja Babu, C/o.Gangireddi House, Narasimaraopet, ward 17th Gorrela Sridhar Street, Tadepalligudem

బై ఆర్డరు ఆఫ్ ది కోర్టు
యాళ్ళబండి రామకృష్ణ పరమహంస
తాడేపల్లిగూడెం అడ్వకేటు, తాడేపల్లిగూడెం
తేది. 29.7.2025 సెల్: 6303018736

'ప్రతిరోజూ నడవడం మంచిది'

భీమవరం : ప్రతీ రోజు నడక అలవాటు చేసుకోవాలని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 201 గవర్నర్ వాకర్ గుంటూరి రామరాజు అన్నారు. పాలకోడేరు గోస్తాని తీర ప్రాతంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యాన పాలకోడేరు వాకర్స్ అసోసియేషన్, ఉషోదయ మహిళా వాకర్స్ అసోసియేషన్, అల్లూరి సీతారామరాజు వాకర్స్ అసోసియేషన్ మోగల్లు సంయుక్త సౌజన్యంతో హెల్త్ అవేర్నెస్ క్యాంప్ ఆదివారం నిర్వహించారు. డాక్టర్ దంతులూరి వెంకటేశ్వరరాజు(గ్యాస్ట్రో ఎంట్రాలజీ), డాక్టర్ సిరిపురపు యుధిష్టర్(కార్డియాలజిస్ట్,) డాక్టర్ జె.శివకుమార్(న్యూరాలజిస్ట్), డాక్టర్ యు.నాగరాజు(జనరల్ మెడిసిన్) పాల్గొని ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి జిల్లా గవర్నర్ వాకర్ గుంటూరి రామరాజు అధ్యక్షత వహించి మాట్లాడారు. సాత్వికాహారం తీసుకోవడం, తగినంత వ్యాయామం చేయడం చేయాలన్నారు. ఆహరంలో ఉప్పు, నూనె తగ్గించి తీసుకోవాలన్నారు. క్యాబినెట్ సెక్రటరీ డాక్టర్ గాదిరాజు కృష్ణంరాజు, ట్రెజరర్ పి.సీతారామరాజు, బులిటన్ ఎడిటర్ సత్యనారాయణ రాజు, ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల వాకర్స్ అధ్యక్షులు గంధి ప్రసాద్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **KANDREGULA BHAVANI,** W/o. Kandregula Babi, D.No. 5-1/1/1, Ward No.1, Lock Peta, Narasapuram-534275, W.G.Dt. After marriage I have changed my name from **BOKKA SREE BHAVANI DEVI** (Old name) to **KANDREGULA BHAVANI** (New name) hence forth I am being called **KANDREGULA BHAVANI** W/o. Kandregula Babi, for all purposes.

పాస్ పోర్ట్ పోయినది

నేను, ఏలేటి చంద్రకళ, భర్త ఏలేటి చినబాబు, ఇంటి నం. 4- 88/1, మెయిన్ రోడ్, పాలమూరు, పెనుమంట్ర (మం), పశ్చిమగోదావరి జిల్లా. ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా పేరు పై ఉన్న పాస్ పోర్ట్ **నెం. V 7835338** రు గలది పెనుమంట్ర నుండి తణుకు వెళుతుండగా మార్గమధ్యంలో పోయినది. దొరికిన వారు పై అడ్రస్ లోని సెల్ నెంబర్ 6309419318 కు తెలియజేయగలరు.

ఏలేటి చంద్రకళ
W/o. ఏలేటి చినబాబు, ఇంటి నెం. 4- 88/1,
మెయిన్ రోడ్, పాలమూరు,
పెనుమంట్ర (మం), పశ్చిమగోదావరి జిల్లా.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల తగాదాల పరిష్కార కమిషన్ - విజయవాడ
ఎఫ్.ఎ.నెం.250 ఆఫ్ 2024 సి.సి. నెం.46 ఆఫ్ 2023
(తేది: 29-02-2024న రాజమహేంద్రవరం వద్ద తూర్పు గోదావరి జిల్లా వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ ఫైల్‌లో)

బిట్వీన్ :
ఒకినావా ఆటో టెక్ ప్రైవేట్ లిమిటెడ్, రిప్రజెంటెడ్ బై మేనేజింగ్ డైరెక్టర్, కార్పొరేట్ ఆఫీస్, యూనిట్ నెం. 651-654, 6వ అంతస్తు, జె.ఎం.డి మెగాపోలీస్ సెక్టార్ 48, సహన్ రోడ్, గుర్గావ్ హర్యానా ఇండియా- 122018.
.....పిటిషనర్/అప్పిలెంట్
మరియు :
శ్రీ లక్ష్మీ మోటార్స్ మరియు ఇతరులు
....రెస్పాండెంట్టు,
ఆర్-2: శ్రీ లక్ష్మీ మోటార్స్, దుర్గా ఆలయం ఎదురుగా దాని యజమాని ప్రతినిధి, జువ్వలపాలెం, తాడేపల్లిగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా, పిన్ - 534102.

గౌరవ కమిషనర్ వారి అనుమతితో తెలియజేయునది ఏమనగా పైన ఉదహరించిన అప్పీల్‌లలో అప్పిలెంట్ సి.సి.నెం: 46 అఫ్ 2023 అప్పీల్ దాఖలు చేసివున్నారు, మీకు పలుమార్లు నోటీసు పంపినప్పటికీ మీరు హాజరు కావడంలేదు. సదరు కమిషనర్ వారి ఉత్తరువుల మేరకు, **తే 04-08-2025దిన వాయిదా ఉన్నది. మీరు ఉ॥ 10.30గం॥లకు హాజరు కాగలరు.** మీకు నోటీసును ఈ పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాము. మీరు కానీ మీతరపున న్యాయవాది ద్వారా కానీ పైన తెలిపిన వాయిదా నాడు గౌరవ కమిషనర్ ఎదుట హాజరుకావలెను.
అప్పీల్ వాయిదా : 04-08-2025

జాగర్లపూడి వెంకటేశ్వర ప్రసాద్
జాగర్లపూడి లక్ష్మి శివనారాయణ
న్యాయవాదులు,
41 -5 -16 పాత పోలీస్ స్టేషన్ రోడ్,
కృష్ణలంక, విజయవాడ, ఫోన్: 9440696216.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల తగాదాల పరిష్కార కమిషన్ - విజయవాడ
ఎఫ్.ఎ.నెం.250 ఆఫ్ 2024 సి.సి. నెం.46 ఆఫ్ 2023
(తేది: 29-02-2024న రాజమహేంద్రవరం వద్ద తూర్పు గోదావరి జిల్లా వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ ఫైల్‌లో)

బిట్వీన్ :
ఒకినావా ఆటో టెక్ ప్రైవేట్ లిమిటెడ్, రిప్రజెంటెడ్ బై మేనేజింగ్ డైరెక్టర్, కార్పొరేట్ ఆఫీస్, యూనిట్ నెం. 651-654, 6వ అంతస్తు, జె.ఎం.డి మెగాపోలీస్ సెక్టార్ 48, సహన్ రోడ్, గుర్గావ్ హర్యానా ఇండియా- 122018.
.....పిటిషనర్/అప్పిలెంట్
మరియు :
శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర మోటార్స్ మరియు ఇతరులు
....రెస్పాండెంట్టు,
ఆర్-4: శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర మోటార్స్, దాని యజమాని ప్రతినిధి డోర్ నెం. 7-273, వేల్పూరి రోడ్ తణుకు పశ్చిమ గోదావరి జిల్లా.534211. 4వ ఎదురుగా ఉన్న పార్టీ

గౌరవ కమిషనర్ వారి అనుమతితో తెలియజేయునది ఏమనగా పైన ఉదహరించిన అప్పీల్‌లలో అప్పిలెంట్ సి.సి.నెం: 46 అఫ్ 2023 అప్పీల్ దాఖలు చేసివున్నారు, మీకు పలుమార్లు నోటీసు పంపినప్పటికీ మీరు హాజరు కావడంలేదు. సదరు కమిషనర్ వారి ఉత్తరువుల మేరకు, **తే 04-08-2025దిన వాయిదా ఉన్నది. మీరు ఉ॥ 10.30గం॥లకు హాజరు కాగలరు.** మీకు నోటీసును ఈ పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాము. మీరు కానీ మీతరపున న్యాయవాది ద్వారా కానీ పైన తెలిపిన వాయిదా నాడు గౌరవ కమిషనర్ ఎదుట హాజరుకావలెను.
అప్పీల్ వాయిదా : 04-08-2025

జాగర్లపూడి వెంకటేశ్వర ప్రసాద్
జాగర్లపూడి లక్ష్మి శివనారాయణ
న్యాయవాదులు,
41 -5 -16 పాత పోలీస్ స్టేషన్ రోడ్,
కృష్ణలంక, విజయవాడ, ఫోన్: 9440696216.